# వాటర్ ట్యాంకు ఎక్కి.. పెట్రోల్ పోసుకొని..



వాటర్ ట్యాంక్ ఎక్కి నినాదాలు చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

- దళిత బంధు లబ్ధిదారుల ఆందోళన
- ఆరు గంటల పాటు నిరసన
- ములుగు కలెక్టరేట్‌లో ఘటన
- ఆర్డీవో, తహసీల్దార్ హామీతో విరమణ
- అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసిన పోలీసులు

ములుగురూరల్, జనవరి 18 : కేసీఆర్ ప్రభుత్వం తమను దళిత బంధు పథకానికి ఎంపిక చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇవ్వకుండా మోసం చేస్తున్నదని ఆరోపిస్తూ లబ్ధిదారులు గురువారం ములుగు కలెక్టరేట్‌లోని వాటర్ ట్యాంక్ ఎక్కి పెట్రోల్ పోసుకొని నిరసన తెలిపారు. సుమారు ఆరు గంటల పాటు ఆందోళన చేశారు. మంత్రి సీతక్క లేదా కలెక్టర్ ఇలా త్రిపాఠి రావాలని, తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో కవ్వంపల్లి బాబు, మీదిగొండ రాజేంద్రప్రసాద్, ఊట్ల మోహన్ పెట్రోల్ చేత డబ్బా పట్టుకోగా రాజేంద్రప్రసాద్ మీద పోసుకొని తన ఆవేదనను వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఎస్సై వెంకటేశ్వర్ సిబ్బంది వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేయగా న్యాయం చేసేవరకూ ఊరుకునేది లేదన్నారు. నిరసన ఉధృతంగా మారుతుండటంతో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, కలెక్టర్‌కు తెలియజేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు హామీ ఇవ్వడంతో కిందకు దిగారు. ములుగు పర్యటనలో ఉన్న మంత్రి, కలెక్టర్ రాకపోవడంతో కలెక్టరేట్‌ను ముట్టడించారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు దళితబంధు సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు కోగిల మహేశ్‌ను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ జిల్లాలోని 1,100 మంది 2వ విడత దళిత బంధు పథకానికి ఎంపికయ్యారని, తమ ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో లబ్ధిదారులు కర్రి శ్యాంబాబు, పసుల కార్తీక్, చంద్రబాబు, గట్టయ్య, కనకం లింగమూర్తి, జీ నగేశ్, చింత రాజు, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామకం

- హనుమకొండ జిల్లా అధ్యక్షురాలిగా రావు పద్మ
- వరంగల్, జనగామ, ములుగు జిల్లాల అధ్యక్షులుగా గంట రవికుమార్, దశమంత్‌రెడ్డి, బలరాం

వరంగల్, జనవరి 18 : భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలిగా రావు పద్మ మరోసారి నియమితులయ్యారు. ప్రస్తుత అధ్యక్షురాలిగా ఉన్న ఆమెను 2వ సారి జిల్లా ప్రెసిడెంట్‌గా పార్టీ గురువారం ప్రకటించింది. అలాగే వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గంట రవికుమార్‌ను నియమించింది. జనగామ జిల్లా అధ్యక్షుడిగా దశమంత్‌రెడ్డి, ములుగు జిల్లా అధ్యక్షుడిగా బలరాం ఎంపికయ్యారు. భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల అధ్యక్షులను ప్రకటించలేదు.

# మిర్చి రైతు ఆశలు ఆవిరి..


నర్సింహులపేటలో కాయ తేలకుండా ఎండిపోయిన మిరప తోట

లక్షల్లో పెట్టుబడి పెట్టాడు.. రాత్రీపగలు కష్టపడ్డాడు.. పంట దండిగా పండితే అప్పుల బాధ నుంచి గట్టెక్కవచ్చని అనుకున్నాడు.. కానీ ప్రకృతి సహకరించక మిగ్‌జాం తుఫాను, చీడపీడలు, వైరస్(గుబ్బ రోగం) రూపంలో పంట చేతికందక ఆదిలోనే మిర్చి రైతు ఆశలను ఆవిరి చేసింది. మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉందని తాహతుకు మించి అప్పు చేసి పెట్టుబడి పెట్టినా నయాపైసా రాక కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు. చీడపీడలు సోకి మిరప కాయ ఏరే అవకాశం లేకుండా పోవడమే గాక కనీసం నాటు వేసిన కూలీలకు సైతం డబ్బులు ఇవ్వలేని పరిస్థితి వచ్చిందని, మిరప పంటను దున్నేందుకు సైతం అప్పులు తేవాల్సి వస్తున్నదని ఆవేదన చెందుతున్నాడు. ఈ క్రమంలో ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

– నర్సింహులపేట, జనవరి 18

- తుఫాను, వైరస్‌తో తీవ్ర నష్టం.. వాతావరణ మార్పులతో పెరగని మొక్కలు
- దెబ్బ తిన్న పంటను దున్నేస్తున్న వైనం.. 73,700 ఎకరాల్లో సాగు
- సుమారు 55వేల ఎకరాల్లో నష్టం.. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

వాతావరణ మార్పులతో మిరప పంటలకు వైరస్ సోకుతున్నది. తుఫాను కారణంగా వారం రోజులుగా రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోయాయి. దీంతో మొక్కల్లో పెరుగుదల లోపించి పసుపు రంగులోకి మారడం, వైరస్ ఆశించిపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా 16 మండలాల్లో 73,700 ఎకరాల్లో సాగు చేస్తే సుమారు 55వేల ఎకరాల్లో వైరస్ సోకి రైతులు నష్టపోయినట్లు వ్యవసాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టిన మిరప రైతుకు ఎకరానికి క్వింటా వచ్చే పరిస్థితి లేదు. నర్సరీలో మిరప మొక్కలు పెంచేందుకు ఒక మొక్కకు 30 పైసల చొప్పున ఎకరానికి రూ.20 వేలు ఖర్చు చేశారు. దురదృష్టవశాత్తు నాటిన కొద్ది రోజులకే వైరస్(గుబ్బ)రోగం రావడంతో మొక్కలను పూర్తిగా తొలగించేందుకు దున్నేశారు. దీంతో మరోసారి మొక్కలు నాటేందుకు ఎకరానికి రూ.20 వేలు ఖర్చు చేసి.. మళ్లీ మొక్కలు కొనుగోలు చేసి నాటాలి. వాటిని దక్కించుకునేందుకు పురుగు మందులు, దుక్కి మందులు వేసినా తీరా చేతికి వచ్చే సమయంలో మళ్లీ వైరస్ సోకితే పంట పూర్తిగా నష్టపోయి ఎకరానికి రూ.లక్ష వరకు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైరస్ తీవ్రత తగ్గకపోవడంతో చేసేదేమీలేక మిరపను దున్నేస్తున్నారు. కాసిన కొద్దోగొప్పో మిరప ఏరేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున నష్టపోయామని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


నర్సింహులపేటలో మిరప తోటను ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

### నయాపైసా వచ్చే అవకాశం లేదు



మా అన్నదమ్ములం ఐదు ఎకరాల్లో మిరప పంట సాగు చేసినం. మొదట్లో నాటిన సమయంలో మొక్కలకు వైరస్(గుబ్బ) రోగం వచ్చింది. మొక్కలను తీసివేయాలని వ్యవసాయ అధికారులు చెప్పడం వల్ల అన్నీ తొలగించాం. మరోసారి ఎకరానికి రూ.20 వేలు పెట్టి నర్సరీలో మొక్కలు తీసుకొచ్చి నాటినం. పైమందులు, అడుగు మందులు వేసినం. తీరా కాయ వచ్చే సమయంలో మళ్లీ గుబ్బ రోగం వచ్చి పంట మొత్తం ఎండిపోతోంది. ఐదు ఎకరాలకు రూ.5లక్షల వరకు నష్టం వచ్చింది. - ఎండీ ఖాజా మొయినుద్దీన్, నర్సింహులపేట

### రెండెకరాలు దున్నేసిన



ప్రతి ఏడాది మాదిరిగానే మిరప సాగు చేసిన. వైరస్ రావడం వల్ల పంట మొత్తం పసుపు పచ్చ రంగులోకి మారి ఎండిపోయింది. నాటు వేసిన కూలీలకు కూడా డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదు. చేసేది ఏమీ లేక రెండు ఎకరాల మిరప మొత్తం దున్నేసిన. యాసంగిలోనైనా మక్కజొన్న సాగు చేసుకుందామని దుక్కి చేస్తున్న. రెండు ఎకరాల మీద సుమారు రూ. 25,000 వేల వరకు పెట్టుబడి పెట్టిన. నయాపైసా రాలేదు. - కొండ్రెడ్డి ప్రభాకర్‌రెడ్డి

### సర్కారు ఆదుకోవాలి



ఎంతో కష్టపడి మిరప సాగు చేస్తే పంట చేతికి వచ్చే అవకాశం లేకుండా పోయింది. రాత్రనక, పగలనక కష్టపడి మిరప సాగు చేస్తే గుబ్బ రోగం వచ్చి పంట మొత్తం పాడైపోయింది. ఎకరానికి లక్ష వరకు పెట్టుబడి పెట్టిన. రూపాయి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోవాలి. - బొమ్మశెట్టి రమేశ్


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు, పర్యవేక్షిస్తున్న ఈవో, ఉత్సవ కమిటీ సభ్యులు

# మల్లన్న హుండీ ఆదాయం రూ. 1.70 కోట్లు

### గత జాతర కన్నా రూ. 16 లక్షలు అధికం

ఐనవోలు, జనవరి 18: ఐనవోలు మల్లికార్జునస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 18 రోజులకు 18 హుండీల ద్వారా రూ. 31,36,817, టికెట్ల ద్వారా రూ. 69,33,448 సమకూరింది. మొత్తం రూ. 1,00,70,265 వచ్చినట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు వెల్లడించారు. లెక్కింపులో పరిశీలకులుగా ఎండోమెంట్ నుంచి జీ సంజీవరెడ్డి, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆర్ఐ మల్లయ్య, ఎస్సై అనిల్‌కుమార్, ఏఎస్సై సత్యానారాయణ, కానిస్టేబుళ్లు రాకేశ్, రఘునరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, మహబూబాబాద్ శ్రీలక్ష్మీవేంకటేశ్వర సేవా సమితి సభ్యులు, అర్చకులు, సిబ్బంది కిరణ్, మధుకర్, శ్రీకాంత్, కన్నయ్య, రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

# ఇన్నోవేషన్స్‌కు కేరాఫ్ టెక్నోజియాన్

- నేటి నుంచి నిట్‌లో నిర్వహణ
- మూడు రోజుల్లో 40 టెక్నికల్ ఈవెంట్లు
- పాల్గొననున్న వివిధ రాష్ట్రాల విద్యార్థులు
- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, జనవరి 18 : వరంగల్ నిట్‌లో ఈ నెల 19 నుంచి 21 వరకు టెక్నోజియాన్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. ఇందులో వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 15 వేల మంది నిట్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొననున్నట్లు చెప్పారు. గురువారం నిట్ సెనేట్ హాల్‌లో ఆయన మాట్లాడుతూ.. 2006లో ప్రారంభమైనన టెక్నోజియాన్ యువతకు సాంకేతిక అభివృద్ధిని అందించడంలో ముందుందన్నారు. ఈ సంవత్సరం టెక్నోజియాన్ థీమ్ ఇంజినియస్ అని, ఇది ఇన్నోవేషన్‌ను సూచిస్తుందన్నారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందరరాజన్ హాజరవుతున్నట్లు చెప్పారు. బ్రహ్మోస్, అగ్ని, పృథ్వీ, ఆకాశ్, నాగ్, త్రిశూల్ క్షిపణి వ్యవస్థల రూపకల్పన, ఉత్పత్తి, అభివృద్ధిలో ఆయనది ముఖ్య పాత్ర అని, నిట్ డైరెక్టర్‌గా పనిచేశారని తెలిపారు. ప్రకాశ్ సంగం(సీఈవో, రెడ్‌బస్), డాక్టర్ టీఎన్ సురేశ్‌కుమార్(సైంటిస్ట్, ఇస్రో), వంశీ కూరపాటి (ఇన్‌ఫ్లూయన్సర్) తదితర ముఖ్యవక్తలు ఉపన్యసిస్తారని చెప్పారు. జహాజ్, ఆర్సీ బగ్గీ, హోవర్‌మానియా, వర్చువల్ రియాల్టీ, డీబగ్గింగ్ మానియా వంటి స్పాట్‌లైట్ ఈవెంట్‌లు నిర్వహిస్తామన్నారు. రెండు రోజుల్లో మెటాల్యాబ్, టీ-వర్క్స్ ద్వారా ర్యాపిడ్ ప్రొటోటైపింగ్, సిమ్యూలింక్ మాస్టర్, ఇన్నోసెర్చ్‌పై వర్క్‌షాప్‌లు ఉంటాయన్నారు. టెక్నోజియాన్‌లో సుమారు 40 టెక్నికల్ ఈవెంట్లను నిర్వహించాలని ప్లాన్ చేసినట్లు చెప్పారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన స్పర్థక్ బృంద వాహన ప్రదర్శన ఉంటుందన్నారు. నిట్ స్టూడెంట్ సెక్రటరీ, ఈవెంట్ ఆర్గనైజర్లుగా చందర్, ప్రశాంత్‌కుమార్, పామర్తి సాహిత్, నజీర్ తనీష్ వ్యవహరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నిట్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ శ్రీనివాసాచార్య, టెక్నోజియాన్ ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ హరిప్రసాద్‌రెడ్డి, స్టూడెంట్స్ ఆక్టివిటీ సెంటర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరికృష్ణ, ప్రొఫెసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# వన దేవతలకు మొక్కులు

- మేడారానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- కిటకిటలాడిన గద్దెల ప్రాంగణం


భక్తులతో కిటకిటలాడుతున్న గద్దెల ప్రాంగణం

తాడ్వాయి, జనవరి 18 : వనదేవతలు మేడారం సమ్మక్క-సారలమ్మ ఆశీస్సుల కోసం భక్తులు బారులు తీరుతున్నారు. ఫిబ్రవరిలో మహా జాతర జరుగనుండగా ముందస్తు మొక్కుల కోసం భారీగా తరలివస్తున్నారు. గురువారం రాష్ట్రం నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి భక్తులు మేడారానికి వచ్చారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు చేసి, కల్యాణకట్టలో పుట్టు వెంట్రుకలు సమర్పించి అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకున్నారు. తల్లులకు పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, సారెను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో జాతర పరిసరాలు రద్దీగా మారుతున్నాయి.

### కుంకుమ భరిణెలు బహూకరణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన దారం కోటిరెడ్డి అమ్మవార్ల ప్రతిరూపమైన వెండి కుంకుమ భరిణెలను రూ.16 వేలతో తయారు చేయించి గురువారం తల్లులకు సమర్పించారు. దర్శనం అనంతరం దేవాదాయశాఖ జూనియర్ అసిస్టెంట్లు జ్ఞానేశ్వర్, మధుకర్‌కు అప్పగించారు.

### అధికారులకు విధుల కేటాయింపు

జాతర పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ విధులు నిర్వర్తించేందుకు గురువారం పంచాయతీ కార్యదర్శులకు ఎంపీవోలు శ్రీధర్, కుమార్, శ్రీనివాస్ విధులు కేటాయించారు. సుమారు 150 మంది కార్యదర్శులను 10 సెక్టార్లలో కేటాయించారు. భక్తులు ముందస్తుగా తరలివస్తుండడంతో డీపీవో వెంకయ్య ఆదేశాల మేరకు వారికి విధులు అప్పగించారు. ఒక్కో సెక్టార్‌కు 10 మంది పారిశుధ్య కార్మికులను నియమించి పనులను నిర్వహించనున్నారు.

### వ్యాపారులకు నోటీసులు

మేడారంలో అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారు వెంటనే షాపులను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి కొర్నిబెల్లి సతీశ్‌కుమార్ వ్యాపారులకు గురువారం నోటీసులు అందజేశారు. అమ్మవార్ల గద్దెల ఎదురుగా, ఐటీడీఏ క్యాంపు కార్యాలయం చుట్టు పక్కల రోడ్డును ఆనుకుని వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్న వారు మూడు రోజుల్లో షాపులను తొలగించాలని సూచించారు. రద్దీ పెరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు చేపడుతున్నారు. ఇందులో బాగంగా షాపులను తొలగించాలని నోటీసులను అందజేశారు. ప్లాస్టిక్ వినియోగించినట్లు తెలిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

# స్వచ్ఛంద సంస్థలకు ఆదర్శం 'బాల వికాస'

- మూఢ నమ్మకాలను పారదోలడంలో కీలకపాత్ర
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



బాలవికాస మహాసభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

న్యూశాయంపేట, జనవరి 18 : మూఢ నమ్మకాలను పారదోలడంలో బాలవికాస సంస్థ ముందుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. ఫాతిమానగర్‌లో బాల వికాస పీడీటీసీ ట్రైనింగ్ సెంటర్‌లో 'నీటి శుద్ధీకరణ పథకాల సుస్థిరతలో గ్రామ పంచాయతీల పాత్ర' అనే అంశంపై 1500 వాటర్ ప్లాంట్ల కమిటీ సభ్యులతో మహాసభ నిర్వహించారు. 3000 మందితో ఏర్పాటు చేసిన ఈ మహాసభకు తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ వినూత్న కార్యక్రమమైనా బాల వికాస నుంచే మొదలవుతుందన్నారు. మహిళా పథకమైనా, చెరువు పూడికతీత, అనాథ పిల్లల రక్షణ, నీటి శుద్ధి ప్లాంట్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయన్నారు. ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టిన బాల వికాస వ్యవస్థాపకురాలు బాలథెరిసాను కొనియడారు. గ్రామీణ వాటర్ ప్లాంట్లకు ఉచిత కరెంట్ అందిస్తే, నిర్వహణకు చార్జీల సమస్య తీరుతుందని కమిటీ సభ్యులు సీతక్క దృష్టికి తీసుకువచ్చారు. బాల వికాస సంస్థ వ్యవస్థాపకురాలు మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో 47 సంవత్సరాలుగా చేస్తున్న పలు సేవా కార్యక్రమాలకు ఎంతో మంది దాతలు సహకరించారన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ.. వాటర్‌ప్లాంట్ల నిర్వహణలో గ్రామ పంచాయతీ, కమిటీలదే ముఖ్యపాత్ర అని తెలిపారు. సదస్సులో సోపార్ కెనడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శోభ, బాల వికాస అధ్యక్షుడు నోముల ఇంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు బాసని మర్రెడ్డి, జనవికాస అధ్యక్షుడు లూర్దు మర్రెడ్డి, రైతు వికాస అధ్యక్షుడు కూసం రాజమౌళి, పీడీటీసీ డైరెక్టర్ సునీతారెడ్డి, సీనియర్ మేనేజర్లు ప్రతాప్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లత, మంజుల, ఫ్రాన్సిస్‌రెడ్డి, తిరుపతి, శోభ, శివరాం, మొగిలి, విజేందర్, మోసెస్ జాన్ పాల్, బాల్ రెడ్డి పాల్గొన్నారు.


కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమ బహుమతి పొందిన ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# కబడ్డీలో మెరిసిన వరంగల్

- బాలికల విభాగంలో నల్లగొండ జట్టు గెలుపు
- ముగిసిన అండర్ 14 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే పల్లా

జనగామ చౌరస్తా, జనవరి 18: 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' ఆధ్వర్యంలో జనగామలో నిర్వహించిన అండర్-14 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జట్టు మెరిసింది. బాలికల విభాగంలో నల్గొండ జట్టు విజయకేతనం ఎగురవేసింది. బాలుర విభాగంలో నల్గొండపై వరంగల్ జట్టు, బాలికల విభాగంలో వరంగల్‌పై నల్గొండ జట్టు గెలిచింది. గురువారం జరిగిన కబడ్డీ ఫైనల్స్‌కు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచేలా కబడ్డీ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు జార్ఖండ్, కడప వెళ్తున్న తెలంగాణ జట్టు క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా జనగామ పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడానికి త్వరలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలిస్తానని తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహించేలా తనవంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన పలువురిని అలరించింది. క్రీడల్లో విజేతలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో రాము, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు మల్లిగారి చంద్రకళ రాజు, బొట్ల శ్రీనివాస్, విద్యాశాఖ అకాడమిక్ జిల్లా కోఆర్డినేటర్ బీ శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ డాక్టర్ తోటకూరి వెంకటేశ్వర్లు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్టేట్ అబ్జర్వర్ రవికుమార్, జిల్లా సెక్రటరీ పోగుల నరేందర్ గౌడ్, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఎస్‌వో ఎండబట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

VIPASSANA EDUCATIONAL TRUST
HETERO INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
(Sai Spurthi Institute of Technology Campus)
B.Gangaram, Sathupally, Khammam District, Telangana - 507 303.
Mail ID : hipsr.principal@gmail.com
WANTED
1. Principal 2. Asso.Professors 3. Asst.Professors
4. Lab Technicians 5. Office Staff & Attenders
Interested and Qualified persons can send their resumes on or before 20.01.2024 by 5PM at the above address with all certificates and testimonials
Departments : Pharmaceutics, Pharmaceutical Chemistry, Pharmaceutical Analysis, Pharmacology & Pharmacognosy
Experience and salary will be as per the PCI norms.
Date : 17.01.2024
Secretary & Correspondent
Vipassana Educational Trust